

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 06 | మార్చి | 2026 | పేజీలు: 08

### ఆత్మీయంగా ముచ్చటిస్తూ

# కలిసి భోజనం చేస్తూ

**ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి**

**కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



**తిప్పర్తి, అక్షిత న్యూస్ :** విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండ ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన తిప్పర్తి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడుతూ వారి చదువు పై ప్రశ్నలు అడిగారు.గత సంవత్సరం జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థులు పదో తరగతిలో 563 మార్కులతో ..మిగతా 2లో



### ఇక అధికారుల

# పల్లెబాట

**99 రోజులు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక షెడ్యూల్**

**6 నుండి జూన్ 12 వరకు కార్యాచరణ**

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులోని ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలోవివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి అమలు చేసేందుకు "ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని , నిర్దేశించిన తేదీల ప్రకారం రోజూ వారీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికపై ఈ నెల 6 న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సన్నాహక సమావేశాన్ని మహబూబ్ నగర్‌లో ..మిగతా 2లో

### అసంపూర్తి ఇళ్లు

# సర్కారుకు అప్పగించాలి

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**




**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి :** అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను పూర్తి చేసి, వెంటనే ప్రభుత్వానికి అప్పజెప్పాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ మండల పరిధిలోని వనపట్ల, గన్యాగుల, పెద్ద ముద్దునూరు గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గురువారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఇళ్ల వద్ద మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని ..మిగతా 2లో

# సేవల్లో నిర్లక్ష్యం సహించం

**మణుగూరులో జిల్లా కలెక్టర్ అంకిత్ సుడిగాలి పర్యటన**



**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత బ్యూరో :** జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం మణుగూరు మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను ..మిగతా 2లో

# పకడ్బందీగా 99 రోజులు

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక**

**కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కె. హరిత పేర్కొన్నారు. గురువారం అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## ఆత్మీయంగా ముచ్చటిస్తూ కలిసి భోజనం చేస్తూ

**మొదటి పేజీ తరువాయి...**

టాప్ ర్యాంక్ సాధించిన విషయాన్ని గుర్తుచేసిన కలెక్టర్, ఈసారి 563 కంటే ఎక్కువ మార్కులు ఎంతమంది తెచ్చుకుంటారని? విద్యార్థులను అడిగారు. దీనికి పది మంది విద్యార్థినులు స్పందిస్తూ తాము 563 కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటామని సమాధానం ఇచ్చారు. విద్యార్థుల ధైర్యాన్ని అభినందించిన కలెక్టర్, వారికి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్ విద్యార్థినులను ప్రోత్సహిస్తూ పరీక్షల సమయంలో భయపడకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. తరువాత హాస్టల్ సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, దోమలు ఉన్నాయా, బెంచీలు సరిపోతున్నాయా, మూత్రశాలలు బాగున్నాయా, ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే హాస్టల్ మెనూలో ఏ వంటలు చేశారో కూడా ప్రశ్నించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేశారు. మండల తహసిల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో జానయ్య, ఎంఈఓ నరసింహ నాయక్, ఏవో సన్నీ రాజు, ప్రిన్సిపాల్ కే. రాజరాజేశ్వరి, ఇంజనీరింగ్ ఏఈ జ్యోతి, సంబంధిత అధికారులు. కలెక్టర్ వెంట ఉన్నారు .

## అసంపూర్తి ఇళ్లు సర్కారుకు అప్పగించాలి

**మొదటి పేజీ తరువాయి...**

సమీక్షించిన కలెక్టర్, పెండింగ్ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పెయింటింగ్, ఎలక్ట్రికల్, డ్రైనేజీ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులైన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పిడి హౌసింగ్ సంగప్ప, నాగర్ కర్నూల్ ఎంపీడీవో, ఆయా గ్రామాల సర్పంచులు, తదితరులు ఉన్నారు.

## సేవల్లో నిర్లక్ష్యం సహించం



**మొదటి పేజీ తరువాయి...**

సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వార్డులు, మందుల నిల్వ, ఔట్‌పేషంట్ సేవలు, సిబ్బంది హాజరును తనిఖీ చేసి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని, ఆసుపత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తదనతరం పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన విధానం గురించి ఆరా తీశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు.గుండు సింగారం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం నాణ్యంగా, సమయానికి అందేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, వైద్యులు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇక అధికారుల పల్లెబాట

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా వివిధ శాఖల ద్వారా నిర్వహించే కార్యక్రమాలలో గ్రామస్థాయి మొదలుకొని జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులు అందరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఆయా శాఖల

**అధికారులందరూ తమకు నిర్దేశించిన తేదీల్లో**



క్షేత్ర స్థాయిలో నిబద్ధతతో, బాధ్యతగా కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా వివిధ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నదని, ఇందులో ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, ఫైల్స్ క్లియరెన్స్, ఆరోగ్యం, విద్య సంక్షేమం, వ్యవసాయం, మహిళలు ,యువత, క్రీడలు, పర్యావరణం, డ్రగ్స్ నివారణ, రహదారి భద్రత తదితర అంశాలపై షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామసభలు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించి వారిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టే ప్రత్యేక పనులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అమలు చేసిన కార్యక్రమాలు చేపట్టనున్న కార్యక్రమాలు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య కార్యక్రమాలు, ప్రత్యేకించి హెచ్ పివి వ్యాక్సినేషన్, సోలార్ విద్యుత్ ,జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే కార్యక్రమాలు, పిల్లలకు గుణాత్మక విద్య అందించడం, డ్రగ్స్ నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ, జాబ్ మేళా నిర్వహణ, పర్యావరణంలో భాగంగా నర్సరీల పంపకం, వివిధ పథకాల కింద ఇప్పటివరకు లబ్ధిదారులకు చేకూర్చిన లబ్ధి వంటి వాటిని గ్రామ సభలలో వివరించడం, యువజన వారోత్సవంలో భాగంగా నిర్వహించే మండల స్థాయి కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు భాగస్వాములు కావాలని, అలాగే అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమాల వంటివి నిర్వహించాలని చెప్పారు.

ఈనెల 6 నుండి 15 వరకు అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలలో శానిటేషన్ కార్యక్రమాలతో పాటు, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమాలు చేపట్టాలని, పెండింగ్ ఫైల్స్ సెక్షన్ వారీగా ఆయా శాఖల్లో లిస్ట్ రూపొందించి క్లియర్ చేయాలని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా ఆయా శాఖల వారిగా సాధించిన అభివృద్ధిపై ప్రజలందరికీ తెలియజేయాలని, అన్ని కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు తమకు సంబంధించిన షెడ్యూల్ ప్రకారం ఆయా రోజుల్లో చేపట్టే కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని సూచించారు.జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా, మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా కార్యక్రమాలు ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని షెడ్యూల్ వారీగా రోజూ వారీ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా అంశాల వారిగా నిర్వహించాల్సిన పనులపై సంబంధిత శాఖల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ , ఆర్.డి.ఓ నవీన్,మున్సిపల్ కమిషనర్ లు,జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## పకడ్బందీగా 99 రోజులు

**మొదటి పేజీ తరువాయి...**

కమిషనర్లతో, ప్రజపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజులు ప్రత్యేక కార్యాచరణపై కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలపై ఈ నెల 6 నుండి జూన్ 12వరకు 99 రోజుల కార్యాచరనపై వివిధ శాఖల అద్వర్యంలో చేపట్టవలసిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ఈ 99






రోజుల కార్యక్రమము ప్రధానంగా 10 అంశాలపై కొనసాగుతుందని తెలిపారు.మార్చి 6 నుండి 15 వరకు గ్రామాలలో మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పెండింగ్ ఫైళ్ళ పరిష్కార కార్యక్రమమ చేపట్టాలన్నారు. మార్చి8న ప్రపంచ మహిళా దినోత్సవమును ఘనంగా నిర్వహించాలన్నారు.ఈ ప్రజపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో సర్పంచులు, వార్డు సభ్యులు,మున్సిపల్ కౌన్సిలర్లు చైర్మన్ లు శాసన సభ్యులు,శాసన మండలి సభ్యులను భాగస్వాములను చేసి వారి భాగస్వామ్యంతో 99 రోజుల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి, నుండి జిల్లాస్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ లో వున్నా ఫైళ్ళ క్లియరెన్స్, ఆరోగ్యం,రహదారి భద్రతలో భాగంగా అరైవ్ అలైవ్, కార్యక్రమము, సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్ కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం,విద్యా,యువత,క్రీడలు,మహిళల సంక్షేమం, పర్యావరణంపై కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు.అధికారులు సమన్వయంతో పని చేసి 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం.డెవిడ్, వివిధ శాఖల అధికారులు, ఎం.పి.డి.ఓ లు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశం




**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు చేపట్టనున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. ఈ కార్యక్రమం అమలుపై జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. అలాగే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత కాలపరిమితిలో లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి శాఖ అధికారి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పథకాలను అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని సూచించారు.

### పది అంశాలపై ప్రత్యేక కార్యాచరణ

మార్చి 6 నుంచి జూన్ 12 వరకు పది ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

1. మార్చి 6--15: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తారు. కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల సక్రమ నిర్వహణ, సమయానుకూల సేవలందింపుపై



చర్యలు తీసుకుంటారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, బహిరంగ ప్రదేశాల శుభ్రత కార్యక్రమాలు చేపడతారు.ఏప్రిల్ 6--11: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారుల పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 13--18: పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ప్రమాదకర ప్రదేశాల గుర్తింపు, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపడతారు. ఏప్రిల్ 20--25: సంక్షేమ పథకాల అమలుపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, హాస్టళ్ల పరిశుభ్రత, గృహపథకాల పురోగతిపై పర్యవేక్షణ చేపడతారు. ఏప్రిల్ 27--మే 2: బాలల రక్షణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన, పిల్లల భద్రత, పాఠశాలల్లో వ్యతిరేక కమిటీల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటారు. మే 4--9: వ్యవసాయ రంగానికి సంబంధించిన కార్యక్రమాల్లో భాగంగా రైతులకు పంటలపై సూచనలు, బీమా--సహాయ పథకాల వివరణ, మట్టి పరీక్షలు, సాగునీరు--విద్యుత్ సమస్యల పరిష్కార చర్యలు చేపడతారు. మే 11--16: విద్య రంగంపై దృష్టి సారించి పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మే 18--23: యువత, క్రీడల అభివృద్ధి కోసం క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, యోగా కార్యక్రమాలు, ఉపాధి మేళాలు, కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహిస్తారు.మే 25--30: మహిళా సాధికారతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాలు, పోషణ అవగాహన, బాల్య వివాహాల నిరోధం, మహిళల భద్రతపై కార్యక్రమాలు నిర్వహిస్తారు.జూన్ 1--12: పర్యావరణ పరిరక్షణపై ప్లాస్టిక్ నిషేధం, మొక్కల సంరక్షణ, వన మహోత్సవ ఏర్పాట్లు, అవగాహన ర్యాలీలు, పాఠశాలల్లో పర్యావరణ పోటీలు నిర్వహిస్తారు.

ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. మార్చి 6న మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలను సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని తెలిపారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి డా. శివప్రసాద్, డీఆర్డీఓ జ్యోతి, డీడబ్ల్యూఓ లలితకుమారి, జిల్లా వైద్యాధికారి డా. వసంతరావు, హౌసింగ్ పీడీ చలపతిరావు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు




**కరీంనగర్, అక్షిత బ్యూరో :** ఇంగ్లీష్ భాష వలన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని,సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపును పొందగలుగుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు.స్థానిక కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో బంగారు పతకాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్స్ తప్పనిసరని, కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా అనేక విజయాలను సొంతం చేసుకోగలుగుతారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రతి విద్యార్థికి అనివార్యమని, వీటి ద్వారా వివిధ స్థాయిలలో గుర్తింపు పొందడమే కాకుండా పటిష్టమైనటువంటి అవకాశాలను సొంతం చేసుకొని ఉన్నతమైన జీవితాన్ని గడపగలుగుతారని వారు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్ భాష పట్ల పట్టు సాధించాలని, కఠోర సాధన ద్వారా ధారళంగా మాట్లాడగలుగుతారని వారు అభిప్రాయపడ్డారు.విద్యార్థులు అందరూ ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించాలని, వాటిలోని విషయాల పట్ల సమగ్ర అవగాహనను పెంపొందించుకొని ముందంజలో నిలవాలని వారు చెప్పారు. ఇటీవల ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీషు ఒలంపియాడ్ లో పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థులు ఏ.శ్రియాన్ రెడ్డి రజత పతకం, వి.వేదవిహార్ బంగారు పతకం,జి.విశాల్ - కాంస్య పతకం, 6వ తరగతి విద్యార్థి కే.సుకృత బంగారు పతకం,7వ తరగతి విద్యార్థులు ఏం.లిఖిత్ -రజత పతకం, బి.తన్మయి బంగారు పతకం పి .సుశ్రిత్ కాంస్య పతకం, 8వ తరగతి విద్యార్థులు ఏం.విగ్నేష్ చంద్ర బంగారు పతకం,ఎల్.అక్షయ రజత పతకం,9వ తరగతి విద్యార్థులు ఏ.యాష్ చంద్ర కాంస్య పతకం,సిహెచ్ శ్రీహిత రజత పతకం టి.అమిత విక్రమ్ - బంగారు పతకం సాధించగా విద్యార్థులకు అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన కే సీతారాం




**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** షాద్ నగర్ పట్టణ సీఐగా కే.సీతారాం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో కందుకూర్ సీఐగా ఒకటిన్నర సంవత్సరం విధులను నిర్వహిస్తున్న సీఐ సీతారాం బదిలీపై షాద్ నగర్ పట్టణ సీఐగా వచ్చారు. 2002 బ్యాచ్ కి చెందిన సీఐ సీతారాం ఉమ్మడి జిల్లాలో గుంటూరు ఏసీబీ లో, నిజామాబాద్ జిల్లాలో వివిధ ర్యాంకులలో పనిచేశారు. ఇక్కడ విధులను నిర్వహించిన పట్టణ సీఐ విజయ్ కుమార్ ను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కు అటాచ్ చేస్తూ సిపి జి. సుధీర్ బాబు ఆదేశాలను జారీ చేశారు....

# విద్యార్థులే పంతులైన వేళ

## తోటి విద్యార్థులకు విద్యాబోధన

**మక్తల్, అక్షిత ప్రతినిధి :** నారాయణపేట జిల్లా నర్వ మండల పరిధిలోని రాయికోడ్ గ్రామంలో గురువారం ప్రాథమిక ఉన్నత పాఠాలలో విద్యార్థులు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలుగా లక్ష్మీప్రసన్న, నవ్యశ్రీ,కలెక్టరు గా కావేరి,డిఈఓగా శివాని, ఎంపీడీఓగా పవిత్ర, తహసీల్దార్ గా జ్యోతి, జిహెచ్ఎం లుగా మేఘన,హర్ష,పిఈటీ లుగా ఎన్ హర్షవర్ధన్,రామ్ చరణ్,సబార్డినేట్ గా ప్రవీణ్ కుమార్ తో పాటు మరో పది మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.పాఠశాలలో విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం రాయల్ హెన్న మాట్లాడుతూ






విద్యార్థుల్లో దాగి ఉన్న సృజ నాత్మకత వెలికి తీసేందుకు ఇలాంటివి ఉపకరిస్తాయన్నారు.అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధా రాణి, నర్మద, వాలంటీర్ యన్ నర్సింలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక

# సొంత ఇంటి కల అద్భుతం

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలి**

**దూసకల్ లో జడల లలిత యాదవ్ గృహప్రవేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** ప్రతి మనిషి జీవితంలో సొంత ఇంటి కల ఎంతో అద్భుతం అని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలబడుతుందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఫరూక్ నగర్ మండలంలోని దూసకల్ గ్రామంలో గురువారం నిరుపేద కుటుంబానికి చెందిన జడల లలిత యాదవ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితర స్థానిక నేతలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడల లలిత యాదవ్ కుటుంబ సభ్యులకు గృహప్రవేశం చేయించి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇల్లు కట్టించి వారి కళ్ళల్లో ఆనందం చూడాలని, స్వంత ఇంటి కళ నిజం చేయాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణ పథకం చేపట్టిందన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, సోదరుడు వీర్లపల్లి శంకర్ ఈ పథకం విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతిఒక్కరికి షాద్ నగర్ నియోజక వర్గములో ఎమ్మెల్యే శంకర్ సహకారంతో ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. నూతన గృహ ప్రవేశం చేసిన జడల లలిత యాదవ్ కుటుంబ సభ్యులకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

# లింగాల సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మకు శిక్షణ పొందిన పత్రం



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** గ్రామపంచాయతీ అభివృద్ధి, గ్రామస్థులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో లింగాల సర్పంచ్ ఈశ్వరమ్మ పాల్గొని పంచాయతీ పరిపాలన, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి మరింత కృషి చేసి లింగాల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తానని సర్పంచ్ ఈశ్వరమ్మ తెలిపారు.

## ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా

# విద్యా కమిషన్ నివేదిక

**పిఆర్టియు తెలంగాణ నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్పవతి**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** తెలంగాణ విద్యా కమిషన్ చేసిన కొన్ని సూచనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పి ఆర్ టి యు తెలంగాణ నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పుష్పవతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సాయిరెడ్డి తెలిపారు.

గౌరవ అధ్యక్షుడు అమర్ సింహా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ శివరామకృష్ణ గౌడ్ సంయుక్తంగా గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని, సమాజ నిర్మాణంలో వారి సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చే వేతనం అనేది దేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించాలని అన్నారు. మానవ వనరులను తయారు చేసే ముఖ్యమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని పేర్కొన్నారు.

తెలంగాణ విద్యా విధానం--2026 పేరుతో విద్యా కమిషన్ సమర్పించిన నివేదిక రాష్ట్ర విద్యా ప్రగతికి కొత్త దిశానిర్దేశం చేయాల్సి ఉన్నప్పటికీ, అందులో ఉపాధ్యాయుల వేతనాలు, ప్రమోషన్లు, నియామకాలపై చేసిన వ్యాఖ్యలు ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు.

విద్యా గణాంకాల ఆధారంగా మదింపు చేయడం వల్ల విద్యారంగంలో అనారోగ్యకరమైన పోటీ పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక ప్రధానోపాధ్యాయుడు మరియు కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రవాణా సౌకర్యం, డిజిటల్ విద్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విద్య, పాఠశాలలలో మౌలిక వసతులు, వృత్తి విద్య, క్రీడా విద్య వంటి అంశాలను బలోపేతం చేసి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా విద్యా విధానం ఉండాలని కోరారు.

అదేవిధంగా రాబోయే నియామకాలలో కాంట్రాక్ట్ విధానం తీసుకురావడం, అప్రెంటిషిప్ విధానం కొనసాగించడం, రెగ్యులర్ నియామకాలను తగ్గించడం వంటి అంశాలు నిరుద్యోగ యువతను మరియు ఉపాధ్యాయులను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు.

కాబట్టి విద్యా కమిషన్ నివేదికలోని ఈ అంశాలను వెంటనే సవరిస్తూ, విద్యారంగ నిపుణుల సూచనలు తీసుకొని మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మహిళల భద్రతకే

# షీటీం ఇన్స్పెక్టర్ సుజాత



**వరంగల్, అక్షిత బ్యూరో:** మహిళల భద్రత కోసమే షీ టీంలు ఏర్పాటు చేశారని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయడం కోసం షీ టీం 24 గంటలు పని చేస్తుందని వరంగల్ పోలీస్ కమిషనరేట్ షీ టీం ఇన్స్పెక్టర్ సుజాత అన్నారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సుజాత మాట్లాడుతూ మహిళలకు వేధింపులు ఎదురైతే వెంటనే పోలీస్ హెల్ప్ లైన్: 100 , షీ టీం నెంబర్ 1930 లేదా తెలంగాణ పోలీస్ సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి మాట్లాడుతూ షీ టీం అనేది మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక పోలీస్ బృందం ఇది మహిళలపై జరుగుతున్న వేధింపులు, ఈవిటీజింగ్, స్టాకింగ్ వంటి సమస్యలను తగ్గించడానికి పనిచేస్తుందన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయడం హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, లైసెన్స్ లేకుండా రోడ్డు పైకి రావడం,వంటివి చేస్తే శిక్షలు పడతాయని,అపరిచితులతో స్నేహం ఫోటోలు చేసుకోవద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్సై స్వాతి సిబ్బంది నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వరప్రసాద్, విజయ్ పాల్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ సతీష్, అనిల్, ఆయేషా, పూర్ణ, శ్రీనివాస్, పాషా, జ్ఞానేశ్వర్, ప్రవంతి, హరిబాబు,కళాశాల ఎన్,సి,సి ఇతర విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

**వరంగల్ సిపి**




**వరంగల్, అక్షిత న్యూస్:** పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. గురువారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ఆయా గ్రామాల్లోకి ప్రజల జీవన శైలి, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా జరిగే నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు, బీట్లు, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణ పై స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్ కు సంబంధించి రికార్డులను సీపీ పరిశీలించారు.

అనంతరం సీపీ మాట్లాడుతూ ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వంతో వ్యవహరించకుండా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని సీపీ తెలియజేసారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తో పాటు, ఎస్. ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజా పాలన కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలి...



### పాఠశాలలు,వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా,సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సీతారామారావు తో కలిసి ముందుగా జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించారు.అనంతరం జిల్లా అధికారులు,ఆర్డీవోలు, ఎంపీడీవోలు,తహసీల్దార్లు, ఎంపీఓలు,మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ బడతాయని తెలిపారు.మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత,ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశు భ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం,రికార్డుల సక్రమ నిర్వహణ,ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు,మున్సిపాలిటీలలో తడి--పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన,ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం -- ఆరోగ్య కరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ,మహిళా,శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు,వైద్య పరీక్షలు, గర్భిణీలు,చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ,పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి (అరైవ్ - అలైవ్) కార్యక్రమం హోం, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని తెలిపారు.రోడ్డు భద్రతపై అవగాహన,ట్రాఫిక్ నియమాల కఠిన అమలు,హెల్మెట్--సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత,రక్షణ -- డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు.మే 4 నుండి మే 9 వరకు రైతుల వ్యవసాయం,రెవెన్యూ, నీటిపారుదల,విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు,ఎరువులు--విత్తనాల లభ్యత,సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు,పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు.మే 18 నుండి మే 23 వరకు యువజన క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు.మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి,స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ,ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించ బడతాయని తెలిపారు.ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ,మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో కార్యాచరణపై గౌరవ మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించ బడుతుందని వెల్లడించారు.సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరు కావాలని ఆదేశించారు.మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం,మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాలు,బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు,చెత్త నిర్మూలన, తడి--పొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు,శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు.తమ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు స్థితి,గ్రౌండ్ లెవెల్ పురోగతి, పెండింగ్ కారణాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు,చెత్త వాహనాలు,డ్రైనేజీ విస్తరణ వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం అత్యంత ముఖ్యమైన అంశమని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు,తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందు పరచాలని సూచించారు.కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శిరీష,సిపిఓ యాదగిరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ,సంబంధిత శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్





**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ దేవ సహాయం నుంచి బాధ్యతలను స్వీకరించారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అదనపు కలెక్టర్ శ్యాం తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ కు చెందిన శ్యాం ప్రసాద్ లాల్ మహాత్మా జ్యోతిబా పూలే విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ గా పనిచేశారు.

## చిన్నారుల భవిష్యత్తుకు పునాది అంగన్వాడీ కేంద్రాలు

## అంగన్వాడి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి



**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంగన్వాడి ఆరవ సెంటర్ లో పోషకాహారాన్ని స్థానిక సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేసేది అంగన్వాడి కేంద్రాలేనని అన్నారు. అంగన్వాడి కేంద్రాలు అందించే కోడిగుడ్లు, బాలామృతం, పిండి పదార్థాలు, సమతుల్య భోజనాలను గర్భవతులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాలు అందించే పోషకాహారంతో చిన్నారుల ఎదుగుదలకు ఉపయోగపడుతూ ప్రాథమిక పాఠశాలలో చేరే నాటికి శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చుంచు రజిత, ఆయా పుల్ల స్వరూప, ఆశా కార్యకర్త రజిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడండి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్న పట్టణ నూతన సీఐ సీతారాం



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి :** షాద్ నగర్ పట్టణంలో శాంతి పద్ధతుల పరిరక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజారక్షణ దోహదపడాలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సిఐ సీతారాం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచిస్తూ.. ప్రజా రక్షణ విషయంలో ఎక్కడ అలసత్వం వహించకూడదని బాధితులకు తక్షణ పోలీసు సాయి మందే విధంగా విధుల్లో చురుకుగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఎమ్మెల్యే వెంటా డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు..

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026

**అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థల జీ.వి. శ్యాంప్రసాద్ లాల్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026 పురస్కరించుకొని గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నందు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఇట్టి కార్యక్రమము నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా జీ.వి. శ్యాంప్రసాద్ లాల్ అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థల , విచ్చేసి వారి యొక్క అమూల్యమైన సందేశాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను మహిళల యొక్క అభివృద్ధి గురించి సమాజంలో వారు ఎదుర్కొంటున్న అంశాల గురించి వివరించడం జరిగినది.

ఇట్టి కార్యక్రమము జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి కె. రాజేశ్వరి పాల్గొని నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీమతి పద్మాలయ ఆచార్య హరికథ ద్వారా మహిళల ఔన్నత్యాన్ని చాటుతూ వారి యొక్క అభివృద్ధికి పాటుపడే విధంగా తన యొక్క హరికథ ద్వారా వివరించారు.

ఆల్ ఇండియా రేడియో వారి ఆధ్వర్యంలో ఒగ్గు కథ మరియు బుర్రకథ లాంటి కళారూపకం ద్వారా వీరు మహిళల యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. తాడూర్ కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించినటువంటి నృత్య కళా రూపకాలు అందరిని ఆకట్టుకున్నాయి చివరగా జిల్లా అధికారులను మరియు శ్రీ సంక్షేమానికి పాటుపడే ప్రముఖ వ్యక్తులను శాలువాలతో పూలమాలతో సన్మానించడం జరిగినది.

## పసుపు పచ్చ పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్న పూల చెట్టు..




**మేడ్చల్, అక్షిత బ్యూరో :** దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం వెళ్లే దారిలో దుండిగల్ పురపాలక సంఘం కార్యాలయం నూతనంగా ఏర్పడ్డ తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మిడిల్ డివైడర్ల ల పై హరితహారం మొక్కలు, ఉద్యాసనతో గోల్డెన్ ట్రీపెంట్ అనే చెట్టు ఎంతగానో విరిగే పూసిన పూలతో ఆకట్టుకుంది ఈ మొక్క చెట్టుకు. ఆకు కూడా లేదు మొండి బారిన కొమ్మలపై విరబూసిన. పసుపు పచ్చ పూలతో ఆహ్లాదాన్ని పంచుతున్న ఈ పూల చెట్టు. ఉద్యవాని కె. వెన్నె తెస్తుంది. దుండిగల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఈ చెట్టు దగ్గర ఆగి మరి చూసి. పూల చెట్టును మురిసిపోతున్నారు..

# సదాశివపేటలో నకిలీ సిగరెట్ల దందా..!

**గోల్డ్ ఫ్లేక్ లైట్స్ పేరుతో డూప్లికేట్ సిగరెట్ల విక్రయం**

**అసలు ప్యాకెట్లతో పోలిక... వినియోగదారులు గందరగోళం**

**తక్కువ ధరకు సరఫరా... మధ్యవర్తులపై అనుమానాలు**

**ఆరోగ్యానికి ముప్పు, ప్రభుత్వానికి ఆదాయ నష్టం ప్రమాదం**

**అక్రమ దందాపై విచారణ చేపట్టాలని వినియోగదారుల డిమాండ్**




**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేటతో పాటు, పరిసర గ్రామాల్లో జోరుగా నకిలీ సిగరెట్ల దందా జరుగుతున్నట్లు వినియోగదారుల నుంచి వస్తున్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రముఖ ఐటీసీ సంస్థకు చెందిన గోల్డ్ ఫ్లేక్ లైట్స్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ సిగరెట్లు మార్కెట్‌లో విక్రయమవుతున్నట్లు సమాచారం. పట్టణంలోని పలు రిటైల్ దుకాణాల్లో ఈ నకిలీ ప్యాకెట్లు లభ్యమవుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. అసలు బ్రాండ్‌కు పోలికగా ప్యాకింగ్ ఉండటంతో సాధారణ



వినియోగదారులు సులభంగా మోసపోతున్న పరిస్థితి నెలకొంది. స్థానిక వ్యాపారులు, వినియోగదారుల వివరణ ప్రకారం అసలు, నకిలీ సిగరెట్ ప్యాకెట్లు బయటకు చూస్తే దాదాపు ఒకేలా కనిపిస్తున్నాయి. ప్యాకింగ్ డిజైన్, హెచ్చరికల ముద్రణ, బ్రాండ్ లోగో కూడా సమానంగా ఉండటంతో తేడా గుర్తించడం కష్టమవుతోందని వారు తెలిపారు. మార్కెట్ ధర కంటే 30 నుంచి 40 శాతం వరకు తక్కువ ధరకు ఈ ప్యాకెట్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. అధికారిక డీలర్ల ద్వారా కాకుండా మధ్యవర్తుల ద్వారా ఈ సరుకు సరఫరా అవుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**లేబుల్‌లో సూక్ష్మ తేడాలు... గుర్తించడం కష్టం**

అసలు గోల్డ్ ఫ్లేక్ లైట్స్ ప్యాకెట్‌పై గోల్డ్ రంగు స్పష్టంగా మెరుస్తూ ఉండగా, నకిలీ ప్యాకెట్లలో అది కొంత మసకబారినట్లు కనిపిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కొన్ని ప్యాకెట్లలో ముద్రణ స్పష్టత లేకపోవడం, అక్షరాల రంగులో తేడా ఉండటం, ప్యాకెట్ నాణ్యత తక్కువగా ఉండటం వంటి లక్షణాలు గమనించవచ్చని పేర్కొంటున్నారు. అయితే ఇవి సూక్ష్మ తేడాలు కావడంతో సాధారణంగా గుర్తించడం కష్టమవుతోందని తెలిపారు.

**ఆరోగ్యానికి ముప్పు... ప్రభుత్వానికి ఆదాయ నష్టం**

నకిలీ సిగరెట్ల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల వినియోగదారుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నియంత్రణలో లేని పొగాకు పదార్థాలు, ప్రమాదకర రసాయనాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

అదేవిధంగా నకిలీ సిగరెట్ల విక్రయం వల్ల ప్రభుత్వానికి జీఎస్టీతో పాటు ఇతర పన్నుల రూపంలో భారీ ఆదాయ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు సూచిస్తున్నాయి. ఈ అక్రమ దందాపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వినియోగదారులు అప్రమత్తంగా ఉండి అధికారిక డీలర్ల వద్ద నుంచే సిగరెట్లు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

# ఓరుగల్లు నుంచి ఢిల్లీకి వేం నరేందర్ రెడ్డి ..

**అభినందనలు తెలిపిన అనిల్ కుమార్ యాదవ్..**

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..** తెలంగాణ రాష్ట్ర నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది పార్టీ అధిష్టానం ముందుగా ఒక స్థానానికి అభిషేక్ మను సింఘ్వీ పేరును ప్రకటించగా రెండోవ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. అయితే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుడు చిరకాల మిత్రుడు వేం నరేందర్ రెడ్డి పేరును ఖరారు చేయడంతో ఉత్కంఠ తెరపడింది.

చేవెళ్ల, మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గల ఇంచార్జ్ గా శాసనసభ ఎన్నికలలో వేం నరేందర్ రెడ్డి పాత్ర కీలకంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన నేతగా,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మిన ఆత్మబంధువు గా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ అధికారం దిశగా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకెళ్లడంలో రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయం



కనిపించింది. అనేక రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ వేం నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని రేవంత్ రెడ్డి ప్రతిపాదించి నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి ని శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేకంగా వేం నరేందర్ రెడ్డి నివాసంలో కలిసి హార్దిక శు భాకాంక్షలు తెలిపారు. అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతాయని అన్నారు. భారతదేశ రాజ్య పాలన బాధ్యతలు కాంగ్రెస్ పార్టీకి అప్పగించడానికి ప్రజలు సమయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అగ్రరాజ్య అమెరికా అధ్యక్షుడికి నరేంద్ర సరెండర్ అయ్యాడని అది దేశ సమగ్రతకు విఘాతం అని అన్నారు. తెలంగాణ గడ్డ నుంచి ఢిల్లీ పార్లమెంట్ లోకి వేం నరేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహించడంతో దేశంలో రేర్ మార్క్ రాజకీయానికి తొలి అడుగు పడింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి మరో సారి అధికారంలోకి వస్తారని, దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ ప్రధాని పీఠాన్ని అధిష్టిస్తారని తన ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కాంప్రమైజ్డ్ పీఎం ని దేశం చూసింది ఇకపై పోరాడే సత్తా ఉన్న వీరుడిని దేశం ప్రధానిగా చూడబోతుందని జోస్యం చెప్పారు.

# జోరుగా అక్రమ నిర్మాణాలు

**దుండిగల్ సర్కిల్‌లో..**

**అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు.పట్టించుకొని టౌన్ ప్లానింగ్ అధికారాలు..**

**టౌన్ ప్లానింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ సిబ్బందిదే..? హవా**

**దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్న ఏసీపీ..**

**దుండిగల్ సర్కిల్ లో ఏసిబి దాడులు జరిగిన మారని అధికారుల తీరు..**

**అవినీతి సంపాదన కోసమే అక్రమ నిర్మాణాలంటూ విమర్శలు వెల్లువ..**



**మేడ్చల్,అక్షిత బ్యూరో:** దుండిగల్ సర్కిల్ లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అటువైపు కన్నెత్తి చూడని అధికారులు నోటీసులతో కాలయాపన చేస్తూ చేతులు దులుపుకుంటున్న టౌన్ ప్లానింగ్ విభాగం.అధికారుల మాత్రం తిలా పాపం తలా పిరికెడు అన్నట్లుగా ఉంది దుండిగల్ సర్కిల్ అధికారుల తీరు,అవుట్ సోర్సింగ్ సిబ్బందే హవా, చేతివాటం,టౌన్ ప్లానింగ్ అవినీతి అధికారుల తీరుతో అక్రమ నిర్మాణాలు మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్లుగా సాగుతున్నాయి,నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులు కన్నెత్తి చూడడంలేదు,బహదూరపల్లి లో పెట్రోల్ బంక్



వెనక భారీ షెడ్డు,దొమ్మర పోచంపల్లి పోలీస్ స్టేషన్ వెనక 1200 గజాల్లో అనుమతులు లేకుండా భారీ షెడ్డు,బౌరంపేట భ్రమరాంబ ఫంక్షన్ హాల్ వద్ద భారీ షెడ్డు దుండిగల్ సర్కిల్ పరిధిలోని ఆరు గ్రామాల్లో విచ్చల విడిగా భారీ షెడ్లు బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదు,అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేతివాటం అవినీతి అధికారుల అండతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.మున్సిపాలిటీ నుండి జీహెచ్ఎంసి గా రూపాంతరం చెందినా అధికారుల తీరు మారడంలేదు,బహదూరపల్లి ప్రైమార్క్ పక్కన రెండు భారీ షెడ్లు,కార్తికేయ నగరంలో కమర్షియల్ షెడ్లు నిరిస్తూ సర్కిల్ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి..

**ప్రభుత్వ భూమిలో అనుమతిలేని నిర్మాణాలు**

బహదూరపల్లి ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిలో అనుమతిలేకుండా అడ్డగోలుగా బహుళ అంతస్తుల నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడడంలేదు,ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలంటే జీవో 58 అనుమతితోపాటు టౌన్ ప్లానింగ్ నుండి అనుమతి తప్పని సరి,ఎటువంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి,ఔట్ సోర్సింగ్ సిబ్బంది చేతివాటంతోనే అక్రమ నిర్మాణాలంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

**నోటీస్‌లతో కాలయాపన**

బహదూర్ పల్లి కార్తికేయ నగర్ వద్ద అనుమతులేని కమర్షియల్ షెటర్లు,బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తాయి,అక్రమ నిర్మాణాలపై పలు దినపత్రికల్లో వార్తాకథనాలు వెలువడడంతో తేరుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి వెనుతిరిగారు.

**పూర్తి స్థాయి అధికారులు ఉన్న ఆగని అక్రమ నిర్మాణాలు..**

దుండిగల్ సర్కిల్ లో టౌన్ ప్లానింగ్ పూర్తి స్థాయి అధికారులు వున్నా అక్రమ నిర్మాణాలను అడ్డుకట్టపడడంలేదు,ఫిర్యాదు చేసినా పట్టించుకోరు,వార్తలు రాసినా పట్టించుకోరు అవినీతి సంపాదనకు అలవాటుపడ్డ అదుకారులు సిబ్బంది చేతివాటంతోనే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతిన్నాయి,అధికారులను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవన్నారు..




# కాలానికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

**జిల్లా కలెక్టర్**




**వరంగల్, అక్షిత బ్యూరో:** మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ ఆధునిక వ్యవసాయాన్ని చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. గురువారం పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఢ హెడ్ డాక్టర్ అరుణ జ్యోతి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు పై కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా 2023--2025 మధ్య నిర్వహించిన అధిక సాంద్రత పత్తి సాగు కార్యక్రమాలు, ప్రదర్శనలు, రైతు శిక్షణలు,ఫలితాలను ప్రతిబింబించే రెండు సంవత్సరాల కార్యకలాపాల సీడీని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్,వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతిపై రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్, వరంగల్ జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ అనురాధ, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్లు సారంగం, సారంగపాణి, హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ నిర్మలతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ సాయికిరణ్, యంగ్ ప్రొఫెషనల్స్ హర్ష, సాయి చంద్ పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

**జిల్లా కలెక్టర్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని కమర్పల్లి ఎంపీపీ ఎస్ పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, వెంటనే శు భ్రపరిచే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు అనుకూలమైన పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని తెలిపారు.

అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. వంటగది పరిస్థితులు, వండిన ఆహారం, నిల్వ ఉంచిన సరుకులను పరిశీలించి విద్యార్థులకు పోషకాహారం నాణ్యతగా అందేలా చూడాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, విద్య పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమా,తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకుగురువారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సత్తుపల్లి లయన్స్ క్లబ్, సత్తుపల్లి లయన్స్ క్లబ్ మేథ సహకారం తో జరిగిన వైద్య శిబిరంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు, షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. సత్తుపల్లి సీ ఐ శ్రీహరి అద్వర్యం లో జరిగిన కార్యక్రమంలో ఎస్సై ప్రదీప్, లయన్స్ క్లబ్, ప్రైవేట్ విద్యాసంస్థల నివాహకులు నాయుడు వెంకటేశ్వర రావు, ప్రభాకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్, గోగడ రవి కుమార్,మురళి, శ్రీనివాసరావు, రత్నాకర్ , కాకతీయ నర్సింగ్ కాలేజీ స్టూడెంట్స్,తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సేవలు అమోఘం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. సమాజంలో సేవా కార్యక్రమాలు అత్యంత ప్రాధాన్యత కలిగినవని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి సంస్థ యొక్క ధర్మమని ఆయన పేర్కొన్నారు. మహబూబ్ నగర్ రెడ్ క్రాస్ సంస్థలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. రవి కుమారుడు ఎం. లోకేష్ ప్రతిభతో ముంబాయి లోని ఈ ఎస్ ఐ సి మెడికల్ కళాశాల లో వైద్య విద్యకు సీటు సాధించారు. సాధారణ కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు కొనసాగించడంలో సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన వెంటనే, సహాయ హస్తం చాపేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబ్ నగర్ శాఖ ముందుకు వచ్చింది. వైద్య విద్య మధ్యలో ఆగిపోకూడదనే లక్ష్యంతో విద్యార్థికి ₹50,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆయన తండ్రి ఎం. రవికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రెడ్ క్రాస్ సంస్థ చేస్తున్న సహాయం ప్రశంసనీయమని అన్నారు. వైద్య విద్య పూర్తిచేసి సమాజానికి సేవ చేయాలని విద్యార్థిని ప్రోత్సహించారు. అలాగే సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవసరమైన వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్, డాక్టర్ సామ్యేల్, సంస్థ సభ్యులు, స్థానిక నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ సేవాభావం ప్రతిఫలించిన సంఘటనగా నిలిచింది.

## ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులు



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** గ్రామపంచాయతీల అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ ఐదు రోజులు పూర్తి చేసుకున్నారు. లింగాల మండల సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ శిక్షణలో పంచాయతీ పరిపాలన, గ్రామాభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామస్థుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

శిక్షణ పూర్తయ్యిన అనంతరం లింగాల మండల సర్పంచ్‌లు తమ తమ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేస్తామని తెలిపారు.

# మాస్ కాపీయింగ్‌కు తావివ్వొద్దు

**పోలీస్ బలగాలతో ప్రత్యేక నిఘా**

**సజావుగా ఇంటర్ పరీక్షలు**

**ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల తనిఖీ**

**కలెక్టర్ బి. చంద్రశేఖర్**





**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఆల్ఫా జూనియర్ కాలేజ్, వేదాంత జూనియర్



కాలేజ్ లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా త్రాగునీరు, శుభ్రమైన మూత్రశాలలు, ప్రథమ చికిత్సతో కూడిన మెడికల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని, మాల్ ప్రాక్టీస్ లేదా మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా హాలులోకి అనుమతించాలని పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.

డిఐఈఓ దస్రు నాయక్, అధికారులు ఉన్నారు.

## జిల్లా సాంస్కృతిక సేన ఆధ్వర్యంలో గెలిచిన మున్సిపాలిటి

# కౌన్సిలర్లకు త్వరలో ఘన సన్మానం

**ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం**

**ఎమ్మెల్యే మందుల సామేలు సూచనలతో సన్మాన సభ**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో**

**మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల యానారెడ్డి సూచనలతో కళాకారుల సంక్షేమ బిల్లుకు కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞత సభ**

**ఉద్యమ కళాకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**సాంస్కృతిక సేన నూతన జిల్లా కమిటీ ప్రకటించనున్నట్లు వెల్లడి**

**సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్**



**నాగారం అక్షిత న్యూస్ :** సూర్యాపేట జిల్లా సాంస్కృతిక సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట నియోజకవర్గం లో ఇటీవల మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులుగా గెలుపొందిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నట్లు సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ కుమార్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏఐసీసీ కమిటీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అధ్యక్షతన, తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మందుల సామేలు సూచనలతో, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల యానారెడ్డి సూచనలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ సభ ఘనంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కౌన్సిలర్లుగా గెలిచిన ప్రజాప్రతినిధులకు సాంస్కృతిక సేన జిల్లా కమిటీ తరఫున ఘన సన్మానం చేయడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా కళాకారుల సంక్షేమానికి సంబంధించి అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టినందుకు గాను కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రత్యేక కృతజ్ఞత సభను కూడా అదే వేదికపై నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇదే సందర్భంగా నూతన జిల్లా కమిటీని కూడా ప్రకటించడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా కళాకారులను ఒక వేదికపై తీసుకుపోయి వారి హక్కుల సాధన కోసం కృషి చేయడం ప్రధాన లక్ష్యమని ఎర్ర అనుదీప్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిజమైన కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కళాకారుల సంక్షేమం కోసం తీసుకువచ్చిన చర్యలు వారికి భరోసా కలిగిస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కళాకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క ఉద్యమ కళాకారుడు కూడా నిరాశ చెందకుండా గుండె ధైర్యంతో ముందుకు సాగాలని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి న్యాయం చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సాంస్కృతిక సేన ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సాంస్కృతిక సేన జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎర్ర రాధిక, తుంగతుర్తి నియోజకవర్గం అధ్యక్షులు వంగూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.